క్లుప్తంగా

జనహిత పాదయాత్రకు తరలిన కాంగ్రెస్ నాయకులు

జైనూర్: ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జనహిత పాదయాత్రకు ఆదివారం జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆదేశాల మేరకు జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో జైనూర్, సిర్పూర్(యూ) మండలాల అధ్యక్షులు అబ్దుల్ ముఖీద్, ఆత్రం శంకర్, మాజీ వైస్‌ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, ఆత్రం ప్రకాశ్, నాయకులు మెస్రం అంబాజీ రావు, ఆత్రం అనిల్, మాజీ సర్పంచి కనక ప్రతిభ, ఆత్రం జాలీంషావు, మెస్రం భూపతి, వసీం, దౌలత్, హైదర్ తదితరులు ఉన్నారు.

‘క్రైస్తవ సిస్టర్లపై కేసులు పెట్టడం అన్యాయం’



మాట్లాడుతున్న పాస్టర్లు

ఆసిఫాబాద్: చత్తీస్‌ఘడ్‌లో క్రైస్తవ సిస్టర్లపై మతమార్పిడి పేరుతో అక్రమ కేసులు పెట్టడం సరికాదని జిల్లా పాస్టర్ల సంఘం ప్రతినిధులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ క్రైస్తవులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. దేశంలో శాంతి నెలకొనాలని ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. పాస్టర్ల సంఘం ప్రతినిధులు కరుణకుమార్, పొన్నాల నారాయణ, పాస్టర్లు పాల్గొన్నారు.

8న సామూహిక వరలక్ష్మీ వ్రతం

కౌటాల: మండల కేంద్రంలోని కంకలమ్మ ఆలయంలో ఈ నెల 8న సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య ఆదివారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఆలయంలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం ఉంటుందని తెలిపారు. ఆలయంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తామని, మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నార్నూర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఇంగ్లిష్ సీఆర్‌టీ గెస్ట్ ఉపాధ్యాయ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేకాధికారిని హిమబిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, బీఈడీ, టెట్ క్వాలిఫై ఉన్న మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 4 నుంచి 7 వరకు కస్తూరిబా గాంధీ పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాడే నాందేవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడారు. గత ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం కింద రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం వెంటనే ఇవ్వాలన్నారు.

‘సోయం’ను విమర్శిస్తే ఊరుకోం

ఉట్నూర్‌రూరల్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సోయం బాపూరావు సుప్రీం కోర్టులో వేసిన విషయంపై మాజీ ఎంపీ సీతారామ్ నాయక్ విమర్శించడాన్ని ఖండిస్తున్నామని రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గుస్సాడిగుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోయం బాపూరావు బీజేపీలో ఉండగా కేసు వేశారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఆయనను విమర్శిస్తే ఊరుకోమని హెచ్చరించారు., ఆదివాసీలకు దక్కాల్సిన ఉద్యోగాలు ఉపాధిని లాక్కొని ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నది మీరు కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో భీమన్న, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

తలమడుగు: సద్గురు శ్రీ పూలాజీ బాబా చూపిన మార్గంలో నడవాలని పూలాజీ బాబా తనయుడు ఇంగ్లే కేశవ్, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పరమహంస సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రం 27వ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

సిద్ధమవుతున్న గణనాథుడు



రంగులు వేయాల్సిన వినాయక ప్రతిమ



రంగులు వేసిన వినాయక ప్రతిమలు

- బిజీబిజీగా ప్రతిమల తయారీదారులు
- అడ్వాన్సులు చెల్లిస్తున్న ఉత్సవ కమిటీలు

కాగజ్‌నగర్‌టౌన్: వినాయక చవితి ఉత్సవాలకు గణనాథులు సిద్ధమవుతున్నాయి. జిల్లాలోని గణనాథుడి తయారీ కేంద్రాల్లో వినాయక విగ్రహాలను తయారీదారులు ఇప్పటికే వందల సంఖ్యలో తయారు చేసి రంగులతో సిద్ధం చేస్తున్నారు. పట్టణంలోని పెట్రోల్‌పంప్ ఏరియాలో గత 12 ఏళ్లగా వినాయక విగ్రహాలను తయారు చేసి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక అడుగు ఎత్తు విగ్రహాలు మొదలుకొని 10 ఫీట్ల ఎత్తు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు తయారు చేసి వాటికి రంగులు అద్దుతున్నారు.

మండపాల ఏర్పాట్లు..

కాగజ్‌నగర్ పట్టణంలో వినాయక చవితి సంబరం అప్పుడే మొదలైంది. గతంలో ఎక్కడో ఒక గల్లీలో వినాయక మండపం ఏర్పాటు చేస్తే అక్కడే పండుగ వాతావరణం ఉండేది. కానీ ప్రస్తుతం ప్రతీ గల్లీగల్లీలో వినాయక విగ్రహాలు కొలువుదీరుతున్నాయి. మండపాలు, విగ్రహాలు అవసరమైన వస్తువులను ఇప్పటినుంచే సమకూర్చుకోవడంలో ఉత్సవ కమిటీ సభ్యులు నిమగ్నమయ్యారు.

మట్టి విగ్రహాలు తయారీ మేలు

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించాలని పర్యావరణ పరిరక్షకులు, శాస్త్రాలు చెబుతున్నప్పటికీ ఏటా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ప్రతిమల సంఖ్య పెరుగుతోంది. ఈ విగ్రహాలు ఆకర్షణీయంగా ఉండడంతో వాటిపై ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు.

ఆకట్టుకునేలా విగ్రహాలు



ఏడేళ్లుగా ఇందిరా మార్కెట్‌లోని కన్యాకాపరమేశ్వరి రోడ్ సమీపంలో వినాయకుడి విగ్రహం ప్రతిష్ఠిస్తున్నాం. భక్తులను ఆకట్టుకునేలా విగ్రహాలను తయారు చేయిస్తున్నాం. ఈ ఏడాది మండపాన్ని సిద్ధం చేశాం. కమిటీ సభ్యులంతా కలిసి సమష్టి కృషితో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం.

– సాయి, గజముఖ గణేశ్ మండపం నిర్వాహకుడు, కాగజ్‌నగర్

ముందస్తు ఆర్డర్లు..



ఆసిఫాబాద్, రెబ్బెన, తాండూరు, బెజ్జూరు మండలాలతో పాటు మహారాష్ట్ర నుంచి ముందస్తుగా ఆర్డర్లు వస్తున్నారు. ఏడు నెలల ముందు నుంచే విగ్రహాలు తయారు చేస్తున్నాం. తయారీకి అవసరమైన ముడిసరుకు బంకమట్టి, కొబ్బరి పీచు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రంగులు తదితర ధరలు మార్కెట్‌లో బాగా పెరిగిపోయాయి. అడ్వాన్సులు తీసుకోవడంతో ఒప్పందం ధరకే ప్రతిమలు అందజేస్తున్నాం.

– రంగయ్య, ప్రతిమల తయారీదారుడు, కాగజ్‌నగర్

పచ్చిమిర్చి @ సెంచరీ



పచ్చిమిర్చి, టమాటా కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

- దారెత్తిస్తున్న టమాటా
- మండిపోతున్న కూరగాయల ధరలు

కెరమెరి: అల్పాహారమైన.. ఆహారమైనా అన్నింట్లో తప్పనిసరిగా కావాల్సింది పచ్చిమిర్చి. విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లతో కూడా ఆహారానికి కారపు రుచిని జోడించే పచ్చిమిరపకాయలు సామాన్యుడికి కంటతడి పెట్టిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి తగ్గడంతో పచ్చిమిర్చి ధర మండిపోయింది. ఆదివారం మండల కేంద్రంలోని వారసంతలో సాధారణ రకమైన పచ్చిమిర్చి కిలో రూ.100 పలుకుతుండగా ప్రత్యేక మిర్చి రూ.120 చేరింది. దీంతో వినియోగదారులు నోరెళ్లబెడుతున్నారు.

సరఫరా తగ్గడంతో..

పచ్చిమిర్చి ధర రూ.10కి పావుకిలో అంటేనే ఎక్కువ అనిపిస్తుంది. నెల రోజుల క్రితం కిలోకు ధర రూ. 50 నుంచి రూ. 60 ఉండగా.. ఆ తర్వాత సెంచరీ కొట్టింది. 20 రోజుల నుంచి ధరలు తగ్గకపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనేందుకు వెనుకాడుతున్నారు. దిగుబడి తగ్గిన కారణంగా ధరలు పెరిగాయని, అందుకు కిలో రూ.100 విక్రయించాల్సి వస్తుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. గత వారం టమాటా రూ.30 కిలో ఉన్నప్పటికీ ప్రస్తుతం కిలో రూ.50కు చేరింది. కాగా మార్కెట్‌లో ఇతర కూరగాయలు ధరలు కూడా భగ్గుమంటున్నాయి. బీరకాయ కిలో రూ.50, అల్చింత రూ.40, గోబి రూ.100, పత్తాగోబి రూ.100, సిమ్లామిర్చి రూ.120, వంకాయి రూ.50, బెండకాయ రూ.40, చిక్కుడుకాయ కిలో రూ.100 ధరలు పలుకుతున్నాయి.

ధరలు నియంత్రించాలి..



వర్షాకాలంలో మిర్చి ధర కిలో రూ.100 ఉండడం ఎప్పుడు చూడలేదు. టమాటా వారం క్రితం రూ.30 ఉండగా ప్రస్తుతం రూ.50 పలుకుతుంది. మండలంలోని అనేక గ్రామాల్లోని రైతులు తమ పొలాల్లోనే కూరగాయలు పండిస్తున్నప్పటికీ ధరలు మాత్రం తగ్గడం లేదు. అధికారులు ధరలు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలి.

– వాడై తానుబాయి, గృహిణి, కెరమెరి

అమ్మవారికి శ్రావణమాస సారె



అమ్మవారికి సమర్పించే సారెతో భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారికి భక్తులు శ్రావణమాసం పురస్కరించుకుని ఆదివారం సారె సమర్పించారు. మండలంలోని భక్తులతో పాటు చుట్టు పక్కల మండలాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి హారతులు ఇచ్చి పూజలు చేశారు. దాంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రామిక మహిళల హక్కుల కోసం పోరాడాలి

కాగజ్‌నగర్‌టౌన్: శ్రామిక మహిళలు తమ హక్కుల కోసం సమైక్యంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర కన్వీనర్ ఎస్.వి రమ అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 7, 9, 10 తేదీల్లో సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభలు మెదక్ జిల్లాలో జరగనున్నాయన్నారు. శ్రామిక మహిళల భాగస్వామ్యం లేనిదే కార్మిక వర్గాల పోరాటాలు విజయవంతం కావని గుర్తించిన సీఐటీయూ 1979లో అఖిల భారత శ్రామిక మహిళ సమన్వయ కమిటీని ఏర్పాటు చేసిందని, అప్పటి నుంచి నిరంతరం మహిళ కార్మికులకు సంఘటితం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగురు రాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మ, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కన్వీనర్ రమ

భక్తిశ్రద్ధలతో మల్లికార్జున స్వామికి పూజలు



పూజలు చేస్తున్న ఒగ్గు పూజారులు

కౌటాల: మండలంలోని శీర్ష గ్రామంలో గల ఒగ్గు పూజారులు శ్రావణమాసం సందర్భంగా ఆదివారం శ్రీ మల్లికార్జున స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఒగ్గు పూజారులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి జోగు పట్టారు. జోగు పట్టిన బియ్యంతో శ్రీ మల్లికార్జున స్వామికి బోనం పోసి మొక్కులు తీర్చుకున్నారు. తరతరాల నుంచి వస్తున్న ఆచారాన్ని ఏటా జరుపుకుంటామని ఒగ్గు పూజారులు తెలిపారు. ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలని పూజలు చేసినట్లు తెలిపారు. శ్రీశైలం, రాజులు, కొమరయ్య, బీరయ్య, పోచయ్య, తిరుపతి, కుమార్, రాము, చందు పాల్గొన్నారు.

విద్యార్థులు యోగా నేర్చుకోవాలి

కౌటాల: విద్యార్థి దశ నుంచే యోగాసనాలు నేర్చుకోవాలని యోగా శిక్షకులు దాసరి వినోద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. యోగ చేస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. యోగాతో ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయాలన్నారు. యోగ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ రేష్మ, వాచ్‌మెన్ సతీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ తిప్పలు..!

- వేలిముద్రల స్థానంలో నూతన టెక్నాలజీ
- ముఖచిత్రాల గుర్తింపులో ఇబ్బందులు
- కొందరు లబ్ధిదారులు పెన్షన్‌లకు దూరం



ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తున్న బీపీఎం

మండలంలో వివిధ రకాల పింఛన్లు పొందే లబ్ధిదారులు..

వృద్ధులు	948
వితంతువులు	702
దివ్యాంగులు	208
ఒంటరి మహిళలు	80
కల్లుగీత కార్మికులు	4
చేనేత కార్మికులు	6
మొత్తం	1948

పెంచికల్‌పేట్: చేయూత పెన్షన్లు మరింత పారదర్శకంగా, పకడ్బందీగా లబ్ధిదారులకు అందజేయడానికి ప్రభుత్వం బయోమెట్రిక్ స్థానంలో నూతన టెక్నాలజీ ఫేషియల్ రికగ్నిషన్ (ముఖగుర్తింపు) వ్యవస్థను ప్రవేశపెట్టింది. బయోమెట్రిక్ పింఛన్ల పంపిణీలో వృద్ధుల వేలిముద్రలు పడకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వం కొత్త పద్ధతిలో ఈనెల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించింది. మండలంలో పింఛన్లు పొందే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు మొత్తం 1948 మంది ఉన్నారు.

ఫేషియల్ రికగ్నిషన్‌లో ఇబ్బందులు..

పింఛన్ల పంపిణీలో వృద్ధుల వేలిముద్రలు పడక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. అయినా పింఛన్ల పంపిణీలో గ్రామీణ ప్రాంతాల్లో బీపీఎంలు ఇబ్బందులు పడుతున్నారు. మొబైల్ ఫోన్‌లలో వృద్ధుల ముఖచిత్రాలు గుర్తించకపోవడంతో పింఛన్ల పంపిణీలో తిప్పలు తప్పడం లేదు. పాత విధానంలో వేలిముద్రలు పడని వృద్ధుల పెన్షన్లను బీపీఎంలు, పంచాయతీ కార్యదర్శుల వేలిముద్రలతో తీసి లబ్ధిదారులకు అందజేశారు. నూతన విధానంలో లబ్ధిదారుల ఫేషియల్ రికగ్నిషన్ చేయాల్సి ఉండటంతో పింఛన్‌దారులకు కష్టాలు తప్పడం లేదు. కాగా ఫేషియల్ రికగ్నిషన్ కాని లబ్ధిదారులు ఈనెల పెన్షన్‌కు దూరమయ్యారు.

ఇబ్బందులు పడుతున్నాం..



గ్రామపంచాయతీలో అధికారులు కొత్త విధానం ద్వారా పింఛన్లు అందిస్తున్నారు. మొబైల్ ఫోన్‌లో ఫోటోలు తీస్తున్నారు. సకాలంలో ముఖచిత్రాలు గుర్తించడం లేదు. దీంతో పింఛన్ తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నాం. పాత పద్ధతిలోనే పింఛన్ అందించాలి.

– మేకల బతుకయ్య, పెంచికల్‌పేట్

కార్యనిర్వాహక కమిటీ ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కోసం మండలంలోని బాబేఝురిలో ఆదివారం కుమురం భీం పోరు గ్రామాల యువజన సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ నిర్వహణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆత్రం లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా రాయిసిడాం జంగు, ప్రధాన కార్యదర్శిగా చహకటి రమేశ్, సంస్కృతిక కార్యదర్శులుగా ఆత్రం సంతోష్, ఆత్రం తుకారాం, కోశాధికారిగా ఆత్రం గంగారాం, ఆత్రం ముకుంద్‌రావు, సహాయ కార్యదర్శులుగా టేకం పర్సురాం, టేకం మారుతి, సభ్యులుగా టేకం ధర్మూ, టేకం గజానంద్, ఆత్రం నాగోరావు, ముచిన్నేని పోచయ్య ఎన్నికయ్యారు.

సన్మానం



సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కౌటాల: మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘం మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఆదే నాందేవ్‌ను ఆదివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు గ్రామీణ ప్రజలకు అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందించాలన్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నాగపురే బండు, నాయకులు ఆత్మరాం, నవీన్, ప్రకాశ్, సాయి, శంకర్, మాంగేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు పచ్చనిహారం



కెరమెరి: మండలంలోని సాంగ్వి కొలాంగూడ గ్రామ సమీపంలో ఉన్న ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. గతంలో రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నేడు వృక్షాలై పచ్చనిహారంలా మారి చూపరులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి.